క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల లో శుక్రవారం నిర్వహించనున్న ఉచిత మహిళా వైద్యశిబిరం నిర్వహణ బ్యానర్‌ను గురువారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆవిష్కరించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికాస తరంగణి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత క్యాన్సర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ.. ఇలాంటి ఉచిత వైద్యశిబిలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠ్యపుస్తకాల వితరణ

ఇల్లెందు: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు వితరణగా అందజేశారు. గురువారం ఇల్లెందు మెయిన్‌రోడ్ హైస్కూల్, జేబీఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా 121 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, దారా రమేష్, ఝెలుగూరి నగేష్ కుమార్, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం



అటవీ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు

జూలూరుపాడు: జూలూరుపాడు, వినోభానగర్ అటవీ నర్సరీల్లో టేకు, శ్రీగంధం మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం ఆయన నర్సరీలను సందర్శించారు. మాట్లాడుతూ.. రెండు నర్సరీల్లో 40,000 టేకు మొక్కలు, 20,000 శ్రీగంధం మొక్కలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఒక్కో టేకు మొక్క రూ.20, శ్రీగంధం మొక్క రూ.25 అని చెప్పారు. మొక్కలు అవసరమైన వారు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్, భద్రాద్రి కొత్తగూడెం పేరున ఎస్‌బీఐలో డీడీ తీసి, స్థానిక ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో అందజేసి, మొక్కలు పొందాలని సూచించారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయండి..

ఇల్లెందురూరల్: విద్యాహక్కు చట్టాన్ని విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని మాదిగ యువసేన జిల్లా అధ్యక్షుడు తాళ్ల శివ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25శాతం ఉచితంగా విద్యనందించాలని విద్యాహక్కు చెపుతున్నా.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రతీ ఏటా విద్యార్థుల ఫీజులు పెంచుతున్న ప్రైవేటు యాజమాన్యాలు పాఠ్యపుస్తకాల పేరిట నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపై చర్య తీసుకోవాలని కోరారు.

'విద్యార్థుల జీవితాలతో చెలగాటం'



మాట్లాడుతున్న సాంబ

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా నాయకుడు టి.అరుణ్ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ... రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయని, రీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడి చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

రేపు ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ

జూలూరుపాడు: 5వ తేదీన ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పగడాల అఖిల్, చల్లగొండ్ల సతీష్ పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- ఇల్లెందులో ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల పక్కా భవనంపై పట్టింపేది..?
- 73 ఏళ్ల క్రితం నిర్మించిన రేకుల పెడ్డులోనే ఇప్పటికీ పాఠాలు
- గదులు లేక 9, 10 తరగతులకు స్వస్తి



డైనింగ్ హాల్ లేక ఆరుబయటే భోజనాలు తింటున్న విద్యార్థులు

ఇల్లెందు: అధికారులు, ప్రజా ప్రతినిధుల పట్టింపు లేక విద్యార్థులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నారు. దీంతో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఒకనాడు కళకళలాడిన ఇల్లెందులో ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల నేడు వెలవెలబోతోంది. ఇల్లెందు పట్టణం నడిబొడ్డున కోర్టు ఎదుట గల ఓ రేకుల షెడ్డులో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హాస్టల్‌తో ఉండేది. 2017లో దీనిని ఆశ్రమ పాఠశాలగా మార్చారు. క్రమంగా హాస్టల్‌ను ఎత్తివేశారు. ప్రస్తుతం 3 నుంచి 8వ తరగతి వరకు 69 మంది విద్యార్థులతో పాఠశాల నడుస్తోంది. ఒకే ఒక్క బోరు, రెండు మున్సిపాలిటీ ట్యాప్‌లు, 10 మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి.

ఆట వస్తువులు ఏర్పాటు చేశారు కానీ నిర్వహణ లేదు. డిప్యూటేషన్ మీద పని చేస్తున్న నలుగురు రెగ్యులర్ టీచర్లు, నలుగురు సీఆర్టీలు ఉన్నారు. ఏడుగురు వంట వర్కర్లు, ఒక ఏఎన్ఎం, ఒక అటెండర్, ఒక ల్యాబ్ అసిస్టెంట్, డిప్యూటీ వార్డెన్ ఉన్నారు. ఒకనాడు ఇక్కడ సీటు దొరకటం ఎంతో కష్టంగా ఉండేది.. నేడు సీట్లు ఇస్తామని వేడుకుంటున్నా ఎవరూ రావటం లేదు.

ఎవరికీ పట్టింపు లేని వైనం..

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పురాతనమైంది. రేకుల షెడ్డు నిర్మాణం చేసి 73 ఏళ్లు. శిథిలావస్థకు చేరిన ఈ రేకుల షెడ్డులో 63 పదో తరగతి బ్యాచ్‌లు చదువుకున్నారు. నేటికీ ఆ రేకుల షెడ్డులోనే ఆశ్రమ పాఠశాల కొనసాగుతోంది. దీనిని 1953 డిసెంబర్ 13న నాటి సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ శంకర్‌దేవ్ శంకుస్థాపన చేశారు. 1955లో ఈ రేకులషెడ్డులో హాస్టల్ ప్రారంభించారు. ఈ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎండకు ఎండి, వర్షానికి తడిచి, చలికి వణుకుతున్నారు. కిటికీలు సక్రమంగా లేవు. కరెంటుపోతే అంధకారం. ఈ ఆశ్రమ పాఠశాల పక్కనే ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో పక్కా భవనంలో సరిపడా గదులున్నాయి. ఆశ్రమ పాఠశాలను వీటిలోకి మళ్లిస్తే బావుంటుందని ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 3వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇదే పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది. ఇక 9, 10 తరగతులు పక్కా భవనాలు లేక 2016 నుంచి తరగతులు కొనసాగించడం లేదు.

నదుపాయాలు అంతంతే..

ఈ రేకుల షెడ్డులో ఒక హాల్, ఒక గది, వరండా ఉంది. విద్యార్థులు ఇక్కడే చదువుకోవడం, ఇక్కడే భోజనం, ఇక్కడే నిద్రించడం జరుగుతుంది. దీంతో వీరి సమస్యలు వర్ణనాతీతం. 69 మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో విద్యార్థులకు సరిపడా గదులు లేవు. స్నానపు గదులు, మరుగుదొడ్లు సక్రమంగా లేక అన్నీ ఆరుబయటే. ఆహ్లాదం, ఆనందం అంటే ఈ విద్యార్థులకు అందని ద్రాక్ష.



అసంపూర్తిగా మిగిలిన మరుగుదొడ్లు

ఒకే గదిలో రెండు తరగతులు..



రేకుల షెడ్డులో ఎండాకాలం వేడిగా, చలికాలం చలిగా ఉంటుంది. ఇక వర్షాకాలం కురుస్తుంది. ఏ కాలం వచ్చినా ఇబ్బందులే. ఒక చేతిపంపు, రెండు నల్లాలు వచ్చినప్పుడే స్నానాలు, బట్టలు ఉతుక్కోవడం. ఒక్కటే హాల్ కావటం వల్ల ఒకవైపు ఒక తరగతి, మరోవైపు మరో తరగతి పాఠాలు జరుగుతాయి. – కోరం ఓంకార్, 6వ తరగతి

పక్కా భవనం ఏర్పాటు చేయాలి..



ఏళ్ల తరబడి ఈ రేకుల షెడ్డులో హాస్టల్ ఉండేది. 2017లో ఆశ్రమ పాఠశాలగా మార్చారు. కానీ తరగతి గదులు లేకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పక్కా భవనం మంజూరు చేయాలి. ఏళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా పక్కా భవనం మంజూరు కావటం లేదు.
– భరత్, ఎస్టీ హాస్టల్ సంక్షేమ అధికారి, ఇల్లెందు

ప్లాస్టిక్ వస్తువులతో అనర్థం..



గుండెపుడిలో మాట్లాడుతున్న శివ

జూలూరుపాడు: ప్లాస్టిక్‌ను తరిమి వేయాలంటూ ఓ ప్రభుత్వ ఉద్యోగి వినూత్న ప్రచారం నిర్వహించారు. ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా జూలూరుపాడు గ్రామవాసి పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్న తిప్పర్తి శివ ప్లాస్టిక్ నిషేధం కోసం గురువారం వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడొద్దు.. ప్రజారోగ్యానికి అనర్థం అని ప్లకార్డులను ప్రదర్శిస్తూ, మైకులో ప్రచారం చేస్తూ జూలూరుపాడు, వెంగన్నపాలెం, గుండెపుడి, జడలచింత, పాపకొల్లు తదితర గ్రామాల్లో పాదయాత్ర చేశారు. ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు కాకుండా కాటన్ సంచులు తెచ్చుకోవాలని వినియోగదారులకు చెప్పాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు.

జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు

సింగరేణి(కొత్తగూడెం): ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకు 29 మంది హాజరు కాగా, 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధిక కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈరోజు ఇంటర్వ్యూలు జరిగాయని, ఎంపికయిన వారికి శిక్షణతోపాటు జీతభత్యాలు చెల్లిస్తారని పేర్కొన్నారు.

దాడిపై ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఇల్లెందు: మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శి భాస్కర్‌ను అదే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా నిరసిస్తూ గురువారం ఇల్లెందు మార్కెట్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు తమ నిరసనను వ్యక్తం చేశారు. వెంటనే దాడికి కారకుడైన ఉపాధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి సుచిత్ర, నరేష్‌కుమార్, శ్రీనివాసరావు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రంజిత్, మునీర్, మధు, లక్ష్మి, విజయ, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి..



మాట్లాడుతున్న లక్ష్మణ్

పాల్వంచ: విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యా వ్యతిరేక నూతన విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. దేశంలో ప్రతీ బిడ్డకు సమానమైన విద్య అందించాలని, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు భగత్ సింగ్ నేషనల్ ఎంపాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ... పూర్తిస్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో సహవాసం చేస్తున్నాయన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్క అజిత్, యు.హరీష్, షాహిద్, రణదీర్, ఎస్.చాంద్ పాషా, పహీం దాదా, జర్పుల ఉపేందర్, సుజన, పవన్ సాయి, నాగేంద్రబాబు, సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందేదెలా..?



రెడ్డిగూడెం వద్ద కిన్నెరసాని ఎడమ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

పాల్వంచరూరల్: వానాకాలం వరిపంట నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో సాగునీటి సరఫరా జరిగే పంట కాలువలపై ఇరిగేషన్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి యానంబైల్, రెడ్డిగూడెం, పాండురంగాపురం, నర్సంపేట, బూర్గంపాడు మండలం వరకు ప్రవహించే ఎడమ కాలువ కింద పదివేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ కాలువ పొడువునా లోపల గడ్డి, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి నీటి సరఫరాకు అడ్డుగా ఉంది. దీంతో సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కిన్నెరసాని కాలువలను శుభ్రం చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



గంగారం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: ప్రస్తుతం వానాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. గురువారం గంగారం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన పిల్లలకు చికిత్స అందించారు. అనంతరం వ్యాధులపై అవగాహన కల్పించారు. అందరూ పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యకరమని, ఆహారం తీసుకునే ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత విధిగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని చెప్పారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నోటిని బ్రష్ చేసుకోవాలని, రెండు పూటలా స్నానం చేయాలని చెప్పారు. వదులుగా ఉన్న దుస్తులు ధరించాలని తడి బట్టలు ఉపయోగించరాదని తెలిపారు. పరిశుభ్రత లోపించడం వల్ల చర్మ సంబంధిత అంటువ్యాధులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 56 మంది విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు శైలజ, హారిక, ధనసరి రాంబాబు, ప్రధానోపాధ్యాయులు జగన్, వార్డెన్ కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సభకు తరలిరండి..



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హాజరుకానున్న కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అయ్యప్పనగర్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు చేపట్టనున్న ప్రచార కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుల కొండం వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బద్ది కిషోర్, కాపర్తి వెంకటాచారి, జోషి కుమార్, కాల్వ భాస్కర్ రావు, కందుకూరి రాము, శాంతివర్ధన్, చాంద్ పాషా, సత్యనారాయణ, నాగేశ్వరరావు, చింతా నాగరాజు, కోటి నాయక్, దేవాలాల్, అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ సభ్యుల ఎన్నిక



చైర్మన్‌గా ఎన్నికైన మంగీలాల్ నాయక్

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా టేకులపల్లి మండలం గోలియా తండాకు చెందిన బోడ మంగీలాల్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం చైర్మన్‌తో పాటు ఆత్మ సభ్యుల కమిటీని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రకటించారు. కమిటీలో 24 మందిని ఎన్నుకున్నారు. టేకులపల్లి మండలం నుంచి 16 మంది.. బండారి నరసింహారావు, బుర్ర ధర్మయ్యగౌడ్, కుంజా సాంబయ్య, భూక్యా మంగీలాల్, చేతుల నాగేశ్వరరావు, జాలాది శ్రీనివాస్, బానోతు రాంజీ, చావగాని బబ్లూ, బానోతు హరిలాల్, గంగారపు శ్రీనివాస్‌రావు, రాసమల్ల నర్సయ్య, వాసం బుచ్చిరాములు, ధరావత్ హరి, గంధసిరి సతీష్, కారం రవి, భూక్యా సరిరాం, ఇల్లెందు మండలం నుంచి 8 మంది.. మంచ రమేష్, మంకిడి జోగయ్య, గట్టు రామ్‌కోటేశ్, బుడ్డి కృష్ణవేణి, భూక్యా ధర్‌సింగ్, మొడెం నవీన్, సప్పిడి ప్రవీణ్, పుప్పాల ఉపేందర్‌లను ఎమ్మెల్యే ప్రకటించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

జూలూరుపాడు: ఉపాధి క్షేత్రసహాయకుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మూడ్ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నామని, ఈ ఉద్యోగంపైనే మా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నామన్నారు. నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించలేక ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు హరికిషన్, రవి, వీరభద్రం, నగేష్, నాగమణి, జగదీష్, లక్ష్మి, షరీఫ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



జూలూరుపాడు: శంకుస్థాపన చేస్తున్న వెంకటరెడ్డి



పాల్వంచరూరల్: రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సీకాలనీలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి భూమిపూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జూలూరుపాడు గ్రామ పంచాయతీలో మొదటి విడతలో 40 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ గాడ్విన్, సెక్రటరీ ఖాదర్ మియా, మోదుగు రామకృష్ణ, నర్వనేని పుల్లారావు పాల్గొన్నారు.

వారంలోగా పునాదులు తీసుకోవాలి

పాల్వంచరూరల్: ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంతవరకు పనులను ప్రారంభించని వారు వారంలోగా పునాదులు తీసి పనులను ప్రారంభించాలని ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీలో 150 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, మరో 20 మంది లబ్ధిదారులు ఇంకా పునాదులు తీసుకోలేదని, వారు వెంటనే పనులు ప్రారంభించాలని లేదంటే మరో పంచాయతీకి ఇళ్లను కేటాయించడం జరుగుతుందన్నారు.

పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

ఇల్లెందురూరల్: సీజనల్ జ్వరాలు ప్రబలకుండా వైద్యశాఖ గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాంపాటి నరేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... గ్రామపంచాయతీలలో అధ్వాన పారిశుద్ధ్యం కారణంగా దోమల ఉధృతి అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల నివారణకు కనీస చర్యలు కూడా చేపట్టకపోవడం విచారకరమన్నారు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టడం పల్లెల్లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవడంపాటు అవసరమైన గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

సమ్మె నోటీసు ఇచ్చిన జీపీ కార్మికులు



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న జేఏసీ నాయకులు



ఇల్లెందురూరల్: ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 9న జరగనున్న సమ్మెలో అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా హెడ్డాఫీస్, బంగ్లోస్‌ల వద్ద కాంట్రాక్ట్ కార్మికుల గేట్ మీటింగ్ జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడే, సమ్మె చేసే హక్కు, వేతనాల కోసం చేసే బేరసారాలాడే హక్కులను లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పెట్టుబడి దారులకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. పనిగంటలు పెంచి శ్రమదోపిడీకి పాల్పడే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కొత్తగూడెంఅర్బన్: కార్మికుల హక్కులు, చట్టాల కోసం జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మేనేజర్ ప్రసాద్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియర్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి జీపీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాల మార్పు పేరుతో గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకరావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూసీఐ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రాయల సిద్దు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నాగు, కార్యదర్శి బానోత్ ధన్వంతరావు, వినోద్, గంధం చంటి, నిమ్మటూరి శ్రీను, మహేష్, జబ్బార్, కళ్లెం శ్రీను, మంగీలాల్, నాగుల్‌మీరా, హుస్సేన్, ఖాసీం పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం గుండెపుడి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, వల్లమల్ల చందర్‌రావు, ఇల్లంగి సీతారాములు, ఆనగంటి సత్యనారాయణ, వల్లమల్ల దానయ్య, నాగమణి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 9న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలు గ్రామపంచాయతీలలో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు మోహన్‌రావు, తొగర సామేలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాగ్యలక్ష్మి, శ్రీను, భీముడు, రాంబాబు, మహేందర్, నగేష్, సమ్మయ్య, రామ్మూర్తి, కృష్ణ, చిన్న, రమేష్ తదతరులు పాల్గొన్నారు.